క్లుప్తంగా

బస్సును ఢీ కొన్న లారీ


ప్రమాదంలో దెబ్బతిన్న ప్రైవేటు బస్సు

పెనుకొండ రూరల్: ప్రైవేటు ట్రావెల్ బస్సును లారీ ఢీ కొన్న ఘటనలో ఒకరు గాయపడిన సంఘటన పెనుకొండ 44వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకొంది. ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు .. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న గ్రీన్ లైన్ ప్రైవేట్ ట్రావెల్ బస్సు హరిపురం వై జంక్షన్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయడానికి డ్రైవర్ ప్రయతి ్నంచాడు. ఈ క్రమంలో బస్సు అదుపుతప్పి లారీని ఢీ కొంది. ఈ ప్రమాదంలో అమ్మవారి పల్లికి చెందిన సాయినాథ్‌రెడ్డి గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది.

మహిళా సర్పంచులకు శిక్షణ

మడకశిర: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో మంగళవారం కూడా మహిళా సర్పంచులకు శిక్షణ తరగతులు జరిగాయి. మండలంలోని మహిళా సర్పంచులు గీత, రంగమ్మ, కవిత, ప్రభావతి, కళావతి, అనితలక్ష్మి, పుట్టమ్మ, గంగమ్మ, రామలింగమ్మ, అంజినమ్మ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికపై మహిళా సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ సోనిబాయి, కార్యాలయ పర్యవేక్షకుడు శ్రీనివాసులు, రీసోర్స్ పర్సన్లు, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కార్యకర్తకు బెయిల్ మంజూరు


జైలు నుంచి విడుదలైన మంజునాథ్‌తో నాయకులు

మడకశిర: మండలంలోని గుండుమల గ్రామానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త మంజునాథ్‌కు మంగళవారం బెయిల్ మంజూరైనట్లు వైఎస్సార్‌సీపీ నియోజవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ఉముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టారంటూ దళితుడైన మంజునాథ్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కోర్టుకెళ్లి న్యాయ పోరాటం చేశారు. చివరకు మడకశిర జూనియర్ సివిల్ కోర్టులో బెయిల్ మంజూరు కావడంతో ఆయన హిందూపురం సబ్ జైలు నుంచి విడుదలయ్యారు. సోషల్ మీడియా కార్యకర్త మంజునాథ్‌కు బెయిల్ మంజూరు కావడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు


అలంకరణలో ఇబ్రహీం బాబా సమాధి

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లిలో వెలసిన ఇబ్రహీం బాబా ఆశ్రమంలో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాబా ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆయన సమాధిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. ఆశ్రమ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ద్విచక్ర వాహనాల సీజ్

సోమందేపల్లి: మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనాల్లో వీలింగ్ చేస్తున్న వారిని పోలీసులు గుర్తించి వారి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రోడ్లపై విన్యాసాలు చేస్తూ ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రమేష్ బాబు హెచ్చరించారు. పట్టుబడిన వాహనాల యజమానులకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

4న జాబ్ మేళా


జాబ్‌మేళా పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 4న నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్ తెలిపారు. మంగళవారం మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రగతి అధ్యక్షత వహించగా జాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే జాబ్ మేళాలో 15 కంపెనీలు పాల్గొంటాయన్నారు.

పేదల గూడుపై నిర్లక్ష్యం

పక్కా గృహాల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇటుకలు, ఇనుము, సిమెంట్ ధరలు కూడా పెరగడంతో పేదలు కనీసం బేస్‌మెంట్లు కూడా నిర్మించుకోలేని పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీలుగా ఉన్న పేర్లను చంద్రబాబు సర్కారు 'పీఎంఏవై ఎన్టీఆర్ నగర్'గా పేరు మార్చింది. కానీ నిర్మాణాలు విషయంలో మాత్రం ఎలాంటి ముందడుగు లేదు.

- కూటమి ప్రభుత్వంలో పురోగతి లేని పక్కా ఇళ్లు
- నత్తనడకన నిర్మాణాలు
- కాలనీల పేర్లను మార్చి చేతులెత్తేసిన ప్రభుత్వం


రొద్దంలో పక్కా గృహాలిలా..

రొద్దం: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. మహిళల పేరు మీద ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు గృహాల నిర్మాణం చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు మారిపోయాయి. పక్కా ఇళ్ల విషయంలో ఎలాంటి పురోగతి లేకపోవడంతో పేదల సొంతింటి కల నెరవేరడం లేదు.

సమస్యలను పట్టించుకునేవారేరీ?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రొద్దం మండలంలో 14 లేఅవుట్లను ఏర్పాటు చేసింది. రాజకీయాలతో సంబంధం లేకుండా పేదలకు 450 ఇళ్లు మంజూరు చేశారు. మునుపెన్నడూ లేని విధంగా లేఅవుట్లలో గ్రావెల్, విద్యుత్, మంచినీటి వసతులు కల్పించారు. ఒక్కో ఇంటికి రూ 1.80 లక్షలు కేటాయించారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో 300 దాకా ఇళ్లు పూర్తయ్యాయి. 250 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వివిధ కారణాలతో మిగిలిన వాటిని నిర్మాణాలు మొదలు కాలేదు. ఎన్నికల అనంతరం ఏర్పడిన కూటమి ప్రభుత్వం వీటి విషయంలో నిర్లక్ష్యం చేస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. దీంతో లేఅవుట్‌లో ముళ్ల చెట్లు పొదల్లా దర్శమిస్తున్నాయి. అలాగే, గత సంవత్సరం చివరి నెలల్లో కురిసిన భారీ వర్షాలకు కానీలో గ్రావెల్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాలకులు అక్కడి సమస్యలపై కన్నెత్తి చూడడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వివిధ దశాల్లో ఉన్న ఇళ్లు 150 మాత్రమే పూర్తి చేశారు. ప్రారంభం కాని ఇళ్లు, నిర్మాణంలో నిలిచిపోయాన ఇళ్ల సంగతి తేల్చడం లేదు. తురకలాపట్నం, రొద్దం కాలనీలలో రోడ్లు ఏర్పాటు చేయకపోవంతో నివాసం ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే కాలు బయటపెట్టలేని పరిస్థితి ఏర్పడుతోంది. పాలకులు స్పందించి కాలనీలలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


కాలనీలో మట్టి రోడ్లు ధ్వంసమై కంపచెట్లు పెరిగిన దృశ్యం

నియోజకవర్గ వ్యాప్తంగా ఇలా..

గోరంట్ల మండలంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దాదాపు 2 వేల ఇళ్లు మంజూరు కాగా 1,500 పూర్తయ్యాయి. 500 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. పెనుకొండలో గత ప్రభుత్వంలో 1967 మంజూరు కాగా, 1113 పూర్తి చేశారు. 854 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. సోమందేపల్లి మండలంలో గత ప్రభుత్వంలో 1,486 ఇళ్లు మంజూరు కాగా గతంలో 764 ఇళ్లు పూర్తి చేశారు. 722 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. పరిగి మండలంలో గత ప్రభుత్వంలో 303 మంజూరు కాగా అందులో 135 పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. రొద్దం మండలంలో 450 ఇళ్లు మంజూరు కాగా అందులో 300 పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తగా మంజూరు చేయలేదు. గతంలో మంజూరైన ఇళ్లు 150 ఇళ్లు పూర్తి చేశారు.

పక్కా గృహాలపై దృష్టి సారించాలి



పేదల పక్కా గృహాల కోసం గత ప్రభుత్వం భూములు కొనుగోలు చేసి జగనన్న కాలనీల రూపంలో కొత్త ఊర్లనే సృష్టించింది. రాజకీయాలకు అతీతంగా పేదలకు ఇళ్లు మంజూరు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్మాణాలు పూర్తిగా మందగించాయి. క్షేత్రస్థాయిలో సమీక్ష చేసి ఇళ్లు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. – నాగమ్మ, ఎంపీపీ, రొద్దం

కొత్త వాటిపై నిర్ణయం తీసుకోలేదు



గత ప్రభుత్వంలో రొద్దం మండలంలో 450 ఇళ్లు మంజూరు అయ్యాయి. కూటమి ప్రభుత్వంలో 150 ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.50 వేలు అదనంగా మంజూరు చేయించాము. అయితే కొత్తగా పట్టాలు, ఇళ్ల మంజూరుపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వ ప్రకటన వచ్చిన తర్వాత ఆ విధంగానే ముందుకు వెళ్తాము. – ఖాజామైనుద్దీన్, ఏఈ, రొద్దం

సంక్షేమ పథకాల అమలులో కూటమి విఫలం


బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పోస్టర్లు విడుదల చేస్తున్న ఉషశ్రీచరణ్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: కేవలం అధికారం కోసమే కూటమి నాయకులు అబద్దాలు చెప్పి గద్దెనెక్కారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ క్యూఆర్ పోస్టర్లను విడుదల చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పోరాటాల ఫలితంగానే నేడు ప్రజలకు అరకొరగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మూడు సిలిండర్లు పథకం అందరికీ కాదు కొందరికే అందుతోందన్నారు. అలాగే తల్లికి వందనం నిధులు కూడా అరకొరగా విదిల్చారన్నారు. సంక్షేమ పథకాలు పరిపూర్ణంగా అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలు అయినప్పటికీ రైతులకు అన్నాదత సుఖీభవ పథకం అందించకపోవడం బాధాకరమన్నారు. బాబు వస్తే జాబు వస్తుందని ఆశగా ఎదురుచూసిన నిరుద్యోగులు ఉద్యోగాలు రాక, నిరుద్యోగ భృతి అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల కన్వీనర్లు నరసింహులు, సుధాకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్లు నాగళూరు బాబు, శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు శేషాద్రి, సద్దాం, యాసిన్ నాయకులు వైశాలి జయశంకర్‌రెడ్డి, మల్లిరెడ్డి, గణప్ప, బాబు, శ్రీరాములు, కొండలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై లోకాయుక్తకు వెళ్తాం

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలో పూడికతీత పనుల్లో కేవలం ఫోటోలు దిగి వాటికి బిల్లులు పెట్టుకునేందుకు చైర్మన్ రమేష్ ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో డిసెల్టేషన్ అవినీతి, సింగిల్ టెండర్ల అంశంలో రికార్డులను చూపి కమిషనర్ సమక్షంలో అధికారులు వివరణ ఇచ్చారు. అయితే ఆ వివరణపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. జరిగిన అవినీతిపై విచారణ జరిపించాల్సిన అధికారులు ఇలా కాంట్రాక్టర్లకు అనుకూలంగా మాట్లాడటం శోచనీయమన్నారు. పూడికతీత అంశంలో జరిగిన అవినీతిపై లోకాయుక్తలో ఆదారాలతో సహా అందించి ఫిర్యాదు చేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తెలిపారు. అంతేకాకుండా సింగిల్ టెండర్ల అంశంలో సెకండ్ కాల్ అంశమే ఎవరికీ తెలియదని, అసలు ఎవరినైనా టెండర్లు వేయనివ్వని అధికార పార్టీ నేతలు సింగిల్ టెండర్ అయ్యేలా చేసుకున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ ఆసిఫ్, కౌన్సిలర్లు శివ, మల్లికార్జున, రామచంద్ర, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ ఆఫీస్‌లో రికార్డుల పరిశీలన, వివరణ అంశంపై చర్చ జరుగుతున్న దృశ్యం

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

పావగడ: ప్రభుత్వం పంచ గ్యారంటీ యోజనను అమలు చేసి ఏనుగు కడుపుకు చెంచాడు మజ్జిగ అందించినట్లు అయిందని స్థానిక సీఐటీయూ అధ్యక్షుడు రామాంజి ఎద్దేవా చేశారు. స్థానిక పాత ఎస్‌ఎస్‌కే కల్యాణ మంటపంలో మంగళవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల 2వ తాలూకా సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మడకశిర: పట్టణంలోని మాశేరొప్పంలో మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'మొహర్రం'ను శాంతియుతంగా జరుపుకోండి

రొళ్ల: హిందూ, ముస్లింలు సోదర భావంతో అందరూ కలసి మెలసి శాంతియుత వాతావరణంలో మొహర్రం వేడుకలు జరుపుకోవాలని ఎస్‌ఐ వీరాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో సిబ్బందితో కలిసి ఎస్‌ఐ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు సూచనలు చేశారు.

దేన్యానాయక్ సేవలు మరువలేనివి

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తూ సోమవారం పదవీ విరమణ చేసిన దేన్యానాయక్ సేవలు మరువలేనివని ఎంపీపీ ఈరన్న, ఈఓఆర్డీ సుధాకర్, ఏఓ విశ్వేశ్వర ఆరాధ్య కొనియాడారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్ దేన్యానాయక్ దంపతులను ఘనంగా సన్మానించారు.

డ్రిప్‌పై అవగాహన

పెనుకొండ: పట్టణంలోని హార్టికల్చర్ కార్యాలయంలో డ్రిప్‌పై అవగాహన కల్పించారు. ఏపీ ఎంఐపీలో పనిచేస్తున్న ఎంఐ, కంపెనీల డీసీఓలు, డీలర్లకు శిక్షణ నిర్వహించారు. ఏపీ ఎంఐపీ పీడీ సుదర్శన్ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇవ్వాల్సిన డ్రిప్ మెటీరియల్, సీసీ మెటీరియల్ గురించి వివరించారు. ఎంఐ కంపెనీల డీలర్లు తమకు నిర్దేశించిన పనిని వెంటనే పూర్తి చేయాలన్నారు.

3న ప్రైవేట్ పాఠశాలల బంద్

పెనుకొండ: పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలను ఈ నెల 3న బంద్ చేయనున్నట్లు ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నాయకుడు రమణారెడ్డి తెలిపారు. అధికారుల ఏకపక్ష తీరు, బలవంతపు అడ్మిషన్లు, పక్షపాత తనిఖీలు తదితర వాటిని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగానే బంద్ చేస్తున్నామన్నారు. ప్రైవేట్ పాఠశాలల యజమానులు బంద్‌కు సహకరించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

పునర్జన్మనిచ్చేది వైద్యులే


వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

పెనుకొండ: అమ్మ జన్మనిస్తే పునర్జన్మనిచ్చేది వైద్యులేనని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు శివరామకృష్ణ పేర్కొన్నారు. డాక్టర్స్‌డేను పురస్కరించుకుని పట్టణంలోని సర్వజనాస్పత్రి వద్ద పలువురు వైద్యులను శివరామకృష్ణ సన్మానించారు. నాయకులు బాబూ ప్రసాద్, రవి, నరసింహులు, ఆంద్రూస్, లక్ష్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రొళ్ల: పిల్లల చదువుతో పాటు పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయురాలు గీత ఎనలేని కృషి చేశారని పిల్లిగుండ్ల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు సుధాకర్, పి.గొల్లహట్టి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఉష తదితరులు పేర్కొన్నారు. మంగళవారం పిల్లిగుండ్లగొల్లహట్టి పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు గీత బదిలీ కావడంతో పాఠశాల ఆవరణలో ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు.

లేపాక్షి: మండలంలోని మైదుగోళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సతీష్ కుమార్, సత్యవతి, సల్మాన్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రారెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌ఎంకు సన్మానం

చిలమత్తూరు: మండల పరిధిలోని కోడూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీరామ్‌నాయక్ పదవీ విరమణ పొందారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఎంఈఓ సాల్మన్‌రాజ్, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ పద్మప్రియ ఆయన సేవలను కొనియాడారు.

మడకశిర: మడకశిర తహసీల్దార్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కరుణాకర్‌కు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కరుణాకర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

'కూటమి' లో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: విద్యావ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఫీజులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నాయని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేసి చదువుకోవడానికి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించి ప్రోత్సహించారని పేర్కొన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం, ఆడుదాం –ఆంధ్ర పేరుతో విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందించిన గ్రామీణ క్రీడలను ప్రోత్సహించారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు ఎలాంటి ప్రోత్సాహం కనిపించడం లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

నేడు మాజీ మంత్రి పర్యటన

సోమందేపల్లి: 'రీ కాలింగ్ చంద్రబాబు' కార్యక్రమంలో భాగంగా సోమందేపల్లిలో బుధవారం జరిగే కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పాల్గొంటారని మండల కన్వీనర్ గజేంద్ర తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

వాహనాల తనిఖీ

అమరాపురం: స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో మంగళవారం ఎస్‌ఐ ఇషాక్‌బాషా ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను తనిఖీ చేసి డ్రైవర్లకు నిబంధనలు పాటించాలని సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషి

మడకశిర: మడకశిర నగర పంచాయతీ పరిధిలో పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్ రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి నూతన నగర పంచాయతీ కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ నూతన కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు వారిని కలిసి సన్మానించారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అదే విధంగా వైఎస్ జగన్ చేసిన మంచిని కూడా ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఉపాధ్యక్షులు మధుసూదన్, గోపి, ప్రధాన కార్యదర్శి ఓంకుమార్, కార్యదర్శి అంజలి, రూరల్ కార్యదర్శి సుధాకర్, కార్యవర్గసభ్యులు వెంకటేష్, శబరి, రామాంజి, శ్రీనివాసులు, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ గ్రామస్థాయి నుంచి వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేద్దామని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి కమిటీ సభ్యులకు వివరించారు. మడకశిర నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ కమిటీ సభ్యులు మంగళవారం సిద్దగిరి గ్రామంలో ఆయన్ను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు మధుసూదన్, సెక్రటరీ అంజలి, సభ్యులు మారుతి, వెంకటేష్, నాయకులు నగేష్,మంజు తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తాం


పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేస్తుందని మంత్రి సవిత అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటగిరిపాళ్యంలో సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే ఉచిత ఇసుక, మూడు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం అమలు చేశామన్నారు. ఆర్డీవో ఆనంద్ కుమార్, తహసీల్దార్ స్వాతి, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాపన్నకు డాక్టరేట్



పావగడ: తాలూకాలోని గుమ్మఘట్టకు చెందిన నరసింహారెడ్డి, రామలక్ష్మమ్మ దంపతుల కుమారుడు ఎస్ పాపన్న డాక్టరేట్ అందుకున్నాడు. బెంగుళూరు విశ్వవిద్యాలయం మేనేజింగ్ డైరెక్టర్ ప్రొ డా వై నాగరాజు ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ టెక్నాలజీ బేస్డ్ ఫైనాన్షియల్ డిసిషన్ – మేకింగ్ ఫర్ వ్యాల్యూ క్రియేషన్ ఇన్ సెలెక్ట్ ఆర్గనైజేషన్ ఆఫ్ బెంగళూరు' అనే అంశంపై వ్రాసిన పరిశోధనా గ్రంథానికి పీహెచ్‌డీ పొందారు.

ఆధ్యాత్మిక శోభ


శ్రీఇంద్రాణి అలంకరణలో సప్తమాతృక అమ్మవారు


అలంకరణలో తుమ్మల మారెమ్మదేవి


అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి


కందిబేడలతో సుబ్రహ్మణ్యస్వామిని అభిషేకించిన దృశ్యం


హిందూపురం: పూజల్లో పాల్గొన్న భక్తులు

హిందూపురం: పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం ఆషాఢ మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు సామూహికంగా అర్చనలు చేసి స్వామివారికి హారతులిచ్చారు. మరోవైపు శ్రీనివాసనగర్‌లోని సప్తఫణి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సంధ్య షష్టి పురస్కరించుకుని విశేష పూజలు చేశారు. కందిబేడలతో స్వామివారిని అభిషేకించారు.

పరిగి: మండల కేంద్రంలోని సప్తమాతృక ఆలయంలో ఆషాఢ గుప్త నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అమ్మవారిని శ్రీఇంద్రాణి రూపంలో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

గుడిబండ: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో వెలసిన తుమ్మల మారెమ్మ ఆలయంలో మంగళవారం నుంచి ఆషాఢ మాసం పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

రొళ్ల: రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజ రోజు కావడంతో అమ్మవారిని కొలిచే వారితో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు.